# ముస్లిముల ధార్మిక విశ్వాసం

రచన

ముహమ్మద్ జమీల్ జైను
సఫీ అహ్మద్ మదనీ

అనువాదం

అబ్దుల్ మతీన్ ఉమరీ

ప్రచురణ

జమ్‌యియ్యతె అహ్లెహదీస్, ఆంధ్రప్రదేశ్

# ముస్లిముల ధార్మిక విశ్వాసం


| | | |
|---|---|---|
| రచన | : | **ముహమ్మద్ జమీల్ జైను**<br>**సఫీ అహ్మద్ మదనీ** |
| అనువాదం | : | **అబ్దుల్ మతీన్ ఉమరీ** |
| ప్రథమ ముద్రణ | : | మే, 2006 |
| ప్రతులు | : | 2000 |
| లేఅవుట్, డిటిపి,<br>టైటిల్ డిజైనింగ్ | : | **వజీర్ ముహమ్మద్**<br>మారియా గ్రాఫిక్స్, హైదరాబాద్<br>ఫోన్: 9849787605 |
| ప్రచురణ | : | **జమ్‌యియ్యతె అహ్లె హదీస్,**<br>**ఆంధ్రప్రదేశ్** |
| లభించు చోటు | : | **కుతుబ్ ఖానా ముహమ్మదీయ**<br>ఇంటి.నెం. 23-1-626,<br>బీబీ బజార్ చౌరాహా,<br>తాలాబ్ కట్ట, హైదరాబాద్.<br>ఫోన్: 040-24529999 |

# ముందు మాట

సకల స్తోత్రాలు అల్లాహ్‌కే చెందుతాయి. జమాఅత్ వ్యక్తుల సేవలో ఈ చిరుపుస్తకాన్ని సమర్పిస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ పుస్తకాన్ని గౌరవనీయులు ముహమ్మద్ జమీల్ జైను గారు రచించారు. మౌలానా సఫీ అహ్మద్ మదనీగారు కొన్ని ప్రశ్నలు-సమాధానాలను ఇందులో చేర్చి పుస్తక ప్రాముఖ్యాన్ని మరింత పెంచారు. ఈ పుస్తకంలో ప్రశ్నోత్తరాల రూపంలో ధార్మిక విశ్వాసానికి సంబంధించిన ముఖ్య విషయాలు చర్చించబడ్డాయి. అంతేకాక జీవితానికి చెందిన అన్ని వ్యవహారాల్లోనూ దివ్యఖుర్‌ఆన్, హదీసుల ద్వారా మార్గదర్శకత్వం పొందాలనే విషయాన్ని ఈ పుస్తకం స్పష్టపరుస్తోంది.

పాఠకులు ఖుర్‌ఆన్ ఆయతులను కంఠస్థం చేసుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ధార్మిక విశ్వాసంతోపాటు ఆచరణ కూడా తప్పనిసరి. ఈ విషయాన్ని పాఠకులు తప్పక గుర్తుంచుకోవాలి. ఎందుకంటే ఆచరణ లేకుండా సాఫల్యం సాధ్యం కాదు. ధార్మిక విశ్వాసం మార్గం చూపెడుతుంది. సాఫల్యం పొందాలనుకునేవారు ఆ మార్గంపై తప్పనిసరిగా నడవాలి. కదలకుండానే గమ్యస్థానానికి చేరుకోవడం అసాధ్యం. ఆచరణ మనిషి ధార్మిక విశ్వాసానికి నిదర్శనం. విశ్వాసం సవ్యదిశలో ఉన్నప్పుడే ఆచరణలు కూడా సవ్యదిశలో ఉంటాయి. అల్లాహ్ వద్ద స్వీకారయోగ్యమవుతాయి. తప్పుడు విశ్వాసాలు మనిషి చేసే ప్రయత్నాలన్నింటినీ నాశనం చేసి వేస్తాయి. దైవప్రవక్తలందరూ (అ.స) విశ్వాసాలను, ఆచరణలను సంస్కరించుకోవాల్సిందిగా ప్రజలకు హితవు గరిపేవారు. నిజానికి మనిషి ప్రతి యుగంలో తన విశ్వాసాన్ని సంస్కరించుకునే అవసరాన్ని కల్గిఉన్నాడు.

విశ్వాసం విషయంలో మనిషి ఏమాత్రం ఏమరుపాటు వహించినా అనేక రకాలైన అపనమ్మకాలు, అనుమానాలు, వైముఖ్య భావాలు అతని మనసులో, అతనికి తెలియకుండానే తిష్టవేస్తాయి. ఈ విధంగా అతడు మార్గభ్రష్టత్వంలోకి నెట్టివేయబడతాడు. కాబట్టి మనం మన విశ్వాసాలను, ఆలోచనలను దైవగ్రంథం 'ఖుర్‌ఆన్', ప్రవక్త (స) సంప్రదాయాలకు అనుగుణంగా మలచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విముఖతకు, ఏమరుపాటుకు గురవుతున్నామా అని మనల్ని మనం ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఉండాలి.

మహోన్నతుడైన అల్లాహ్ ఈ చిన్నపాటి కృషిని స్వీకరించాలని, ఈ సత్కార్యంలో పాలుపంచుకున్న వారందరికీ మంచి ప్రతిఫలం ప్రసాదించాలని నేను వేడుకుంటున్నాను - ఆమీన్

**- ముహమ్మద్ అబ్దుర్రహ్మాన్ ఫారూఖీ**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడయిన అల్లాహ్ పేరుతో

# ముస్లిముల ధార్మిక విశ్వాసం

**1.** ప్రశ్న : **అల్లాహ్ మనల్ని ఎందుకు పుట్టించాడు?**

జవాబు : ఆయన మనల్ని కేవలం తన ఆరాధన కొరకు సృష్టించాడు.

وماخَلَقْتُ الجِنَّ والانْسَ الا لِيَعْبُدُوْنِ

అనువాదం:

**నేను జిన్నాతులనూ, మానవులనూ కేవలం నా ఆరాధన కొరకు మాత్రమే సృష్టించాను.** (అజ్ జారియాత్ :56)

హదీస్ : అల్లాహ్‌కు ఆయన దాసులపై ఉన్న హక్కు ఏమిటంటే, వారు ఆయన్నే ఆరాధించాలి. ఈ ఆరాధనలో మరెవ్వరినీ భాగ స్వాములుగా చెయ్యకూడదు. (బుఖారీ, ముస్లిం)

**2.** ప్రశ్న : **అల్లాహ్ దాస్యం మనం ఏ విధంగా చెయ్యాలి?**

జవాబు : అల్లాహ్, ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఆదేశించిన విధంగా చిత్తశుద్ధితో చెయ్యాలి.

وماأمِرُوْا الالِيَعْبُدُوْا اللهَ مخْلِصينَ له الدِّين حُنَفاءَ ......... الآية

అనువాదం:

**వారు విధేయతను ఆయనకే ప్రత్యేకిస్తూ, అల్లాహ్‌కు దాస్యం చెయ్యాలని, మిథ్యా దైవాల నుంచి ముఖం త్రిప్పుకోవాలని మాత్రమే ఆదేశించడం జరిగింది.** (అల్ బయ్యినహ్ : 5)

హదీస్ : మేము ఆచరించినట్టుగా నిర్ధారితంకాని ఆచరణ ఏదైనా రద్దుచేయబడుతుంది (స్వీకరించబడదు). (ముస్లిం)

**3. ప్రశ్న : మనము అల్లాహ్ దాస్యం భయంతో, ఆశతో చేయాలా?**

జవాబు : అవును, ఆయన దాస్యం శిక్షపడుతుందనే భయంతో, పుణ్యఫలం లభిస్తుందనే ఆశతో చేయాలి.

وادعوه خوفاً وطمعاً

అనువాదం:

**మీరు ఆయన్నే వేడుకోండి, భయంతోనూ, ఆశతోనూ (అంటే నరకానికి భయపడుతూ, స్వర్గం లభిస్తుందనే ఆశతో)** (అల్ ఆరాఫ్ : 56)

హదీస్: నేను స్వర్గం ప్రసాదించమని అల్లాహ్‌ను వేడుకుంటున్నాను. నరకం నుంచి ఆయన శరణు కోరుతున్నాను. ( అబుదావూద్ )

**4. ప్రశ్న : ఆరాధనలో 'ఇహ్సాన్' అంటే ఏమిటి?**

జవాబు : అల్లాహ్ మనల్ని కనిపెట్టుకుని ఉన్నాడనే భావన కల్గి ఉండడాన్ని 'ఇహ్సాన్' అంటారు.

ان اللهَ كانَ عليكم رقيباً ....... الَّذي يراكَ حينَ تَقُومُ ........ الآية

అనువాదం :

**నిస్సందేహంగా అల్లాహ్ మిమ్మల్ని కనిపెట్టుకుని ఉన్నాడు.**
(అన్‌నిసా : 1)

**మీరు నమాజ్ చేసేటప్పుడు ఆయన మిమ్మల్ని చూస్తున్నాడు.**
(అష్ షుఅరా : 218)

హదీస్ : ఇహ్సాన్ అంటే, నీవు అల్లాహ్ ఆరాధనను, ఆయన్ని నీవు చూస్తున్నట్లుగా చేయడం. నీవు ఆయన్ని చూడకపోయినా, ఆయనయితే నిన్ను చూస్తున్నాడు. ( ముస్లిం)

**5. ప్రశ్న : అల్లాహ్ తన సందేశహరుల్ని ఎందుకు పంపాడు?**

జవాబు : కేవలం తన దాస్యం వైపునకు పిలువడానికి, షిర్కు (బహుదైవా రాధన)ను ఖండించడానికి మాత్రమే అల్లాహ్ తన సందేశహరుల్ని పంపాడు.

**ولقدْ بَعَثْنافي كل أمة رسولاً أن اعْبُدُوا اللهَ واجْتَنِبُوا الطّاعُوت ...... الآية**

అనువాదం:

**మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా ఇలా హెచ్చరిక చేశాము; అల్లాహ్ దాస్యం చెయ్యండి, మిథ్యా దైవాల ఆరాధనకు దూరంగా ఉండండి.** (అన్ నహ్ల్ : 36)

హదీస్ : గౌరవ ప్రవక్తలు పరస్పరం సోదరులు. వారి ధర్మం ఒక్కటే. (దైవప్రవక్తలందరూ ఏకదైవారాధన వైపు ప్రజల్ని పిలిచారు.) (బుఖారీ, ముస్లిం)

**6.** ప్రశ్న **: 'తౌహీదె ఉలూహియ్యత్' అంటే ఏమిటి?**

జవాబు : 'తౌహీదె ఉలూహియ్యత్' అంటే అన్ని రకాల ఆరాధనలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే. ఉదాహరణకు అర్థించడం, మొక్కుకోవడం, తీర్మానాలు చేసేవాడు అల్లాహ్‌యే అని భావించడం.

**فاعْلَمْ أنّه لااله الا الله ....... الآية**

అనువాదం :

**ప్రవక్తా! బాగా తెలుసుకో, అల్లాహ్ తప్ప ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు అని. (అంటే అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు ఎవ్వడూలేడు అని)** (ముహమ్మద్ : 19)

హదీస్ : మొదటగా నీవు దేని వైపునకు అయితే పిలుస్తావో అది 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అయి ఉండాలి. (బుఖారీ, ముస్లిం)

**7.** ప్రశ్న **: 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అర్థం ఏమిటి?**

జవాబు : ఆరాధనకు అర్హుడు కేవలం అల్లాహ్ యే అని, ఆయన తప్ప ఆరాధింప బడేవారందరూ మిథ్యాదైవాలే అని విశ్వసించడం.

**ذلک بان الله هو الحق و انَّ ما یَدْعُوْنَ منْ دُوْنِهِ الباطلُ ....... الآیة**

అనువాదం:

**ఎందుచేతనంటే అల్లాహ్‌యే సత్యం కాబట్టి , ఆయనను కాదని వారు పిలిచేవన్నీ అసత్యాలే కాబట్టి.** (లుఖ్‌మాన్ : 30)

హదీస్ : 'లా ఇలాహ ఇల్లల్లాహ్' సద్వచనాన్ని పలికి, మిథ్యాదైవాల ఆరాధనను తిరస్కరించిన వ్యక్తి సంపద, రక్తం పవిత్రం అవుతాయి. (ముస్లిం)

**8.** ప్రశ్న **: సిఫాతె ఇలాహీ (అల్లాహ్ గుణవిశేషాలు)లో తౌహీద్ అనగానేమి?**

జవాబు : అల్లాహ్, ఆయన ప్రవక్త (స) ఇద్దరూ అల్లాహ్ కోసం ప్రత్యేకం చేసిన గుణవిశేషాలను అంగీకరించడం.

**لیْسَ کَمِثْلِهِ شیءٌ وهو السَّمِیْعُ البَصِیْرُ**

అనువాదం :

**ఆయనను పోలిన వస్తువు సృష్టిలో ఏదీలేదు. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ చూసేవాడూను.** (అష్ షురా : 11)

హదీస్ : మా ప్రభువు ప్రతి రాత్రి సమీప ఆకాశానికి దిగివస్తాడు. (ఈ దిగిరావడం అన్నది ఆయన వైభవానికి తగట్టుగా ఉంటుంది) (బుఖారీ, ముస్లిం)

**9.** ప్రశ్న **: తౌహీద్ (ఏకదైవారాధన)కు కట్టుబడిన ముస్లింకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది?**

జవాబు : ఇహలోకంలో రుజుమార్గం, ప్రళయంలో శాంతి లభిస్తాయి.

**الذین آمنوا ولم یلبسوا ایمانَهم بظُلْمٍ أؤلئک لَهُمُ الأ منُ وهمْ مُهتَدُوْنَ**

అనువాదం :

**విశ్వసించినవారికి, విశ్వాసాన్ని దుర్మార్గంతో కలుషితం చేయని వారికే శాంతి, వారు మాత్రమే రుజుమార్గంపై ఉన్నారు.** (అల్ అన్ఆమ్ : 82)

హదీస్ : దాసులకు అల్లాహ్‌పై ఉన్న హక్కు ఏమిటంటే, ఆరాధనలో తనకు భాగస్వాములుగా చెయ్యనివారిని శిక్షించకుండా వుండాలి. (బుఖారీ, ముస్లిం)

**10.** ప్రశ్న : **అల్లాహ్ ఎక్కడ ఉన్నాడు?**

జవాబు : అల్లాహ్ సామ్రాజ్యపీఠం (అర్ష్)పై ఏడవ ఆకాశం మీద ఉన్నాడు.

الرَّحمنُ على العَرْشِ اسْتوى

అనువాదం :

**కరుణామయుడు సామ్రాజ్యపీఠంపై ఆసీనుడై ఉన్నాడు.**

(తాహా : 5)

హదీస్ : నిస్సందేహంగా అల్లాహ్ ఒక గ్రంథాన్ని రాసి ఉంచాడు. 'నిశ్చయంగా నా కారుణ్యం నా క్రోధాన్ని జయించింది.' ఇది ఆయన వద్ద గల 'అర్ష్' మీద రాసి ఉంది. (బుఖారీ)

**11.** ప్రశ్న : **మనతోపాటు అల్లాహ్ తన అస్థిత్వంతో ఉన్నాడా లేదా తన జ్ఞానంతో ఉన్నాడా?**

జవాబు : అల్లాహ్ మనతోపాటు తన జ్ఞానం ద్వారా ఉన్నాడు. ఆయన మనం చెప్పేది వింటున్నాడు. మనల్ని చూస్తున్నాడు.

قال لا تَخافا انني مَعُكُما أسْمَعُ وأرى

అనువాదం:

**అల్లాహ్ (మూసా, హారూన్ అలైహిముస్సలాంలతో) ఇలా అన్నాడు, మీరు భయపడకండి. మీతోపాటు నేనూ ఉన్నాను. అంతా వింటూ ఉన్నాను, చూస్తూ ఉన్నాను.** (తాహా : 46)

హదీస్ : నిస్సందేహంగా మీరు ఒక అస్థిత్వాన్ని వేడుకుంటున్నారు. ఆయన బాగా వింటాడు, మీకు అత్యంత సమీపంలో ఉన్నాడు, మీతోపాటు ఉన్నాడు. (ముస్లిం)

**12. ప్రశ్న : అతిపెద్ద పాపం ఏమిటి?**

జవాబు: అతిపెద్ద పాపం షిర్కె అక్బర్, అంటే ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేయటం.

**ان الله لا يغفرأن يُشرَكَ به ويَغفِرُمادُونَ ذلك لِمَنْ يَشاءُ ومَنْ يُشرِكْ بالله فَقَدِافتَرى اثماً عظيماً**

అనువాదం :

**నిస్సందేహంగా అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్కు(బహుదైవారాధన) మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా తాను ఇష్టపడిన వారి కొరకు క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవాడు ఎంతో ఘోరమైన అబద్ధాన్ని కల్పించుచున్నాడు.** (అన్ నిసా : 48)

హదీస్ : అతి పెద్ద పాపం ఏమిటో చెప్పండని ప్రవక్త (స) ను అడగడం జరిగింది. దానికి ఆయన (స) ఇలా సమాధానమిచ్చారు- అల్లాహ్‌కు భాగస్వాములుగా చేయడం. వాస్తవానికి ఆయనే మిమ్మల్ని సృష్టించాడు. (ముస్లిం)

**13. ప్రశ్న : షిర్కె అక్బర్ (అతిపెద్ద షిర్కు) అంటే ఏమిటి?**

జవాబు : ఏ రకమైన ఆరాధననైనాసరే అల్లాహ్‌ను కాదని దైవేతరులకు ప్రత్యేకించటం. ఉదాహరణకు ఇతరులను వేడుకోవడం.

**قلْ انما ادْعوربِّى ولا أشركُ به أحداً**

అనువాదం :

**ఓ ప్రవక్తా ! ఇలా చెప్పు, నేనైతే నా ప్రభువునే ప్రార్థిస్తాను, ఆయనకు భాగస్వాములుగా మరెవ్వరినీ నిలబెట్టను.** (అల్ జిన్ : 20)

హదీస్ : అతిపెద్ద పాపం, ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేయడం. (బుఖారీ)

**14. ప్రశ్న : అతిపెద్ద 'షిర్కు'కు ఒడిగడితే ఎలాంటి నష్టం కల్గుతుంది.?**

జవాబు : అతిపెద్ద షిర్క్ నరకంలో శాశ్వతంగా ఉండడానికి కారణ మవుతుంది.

انه من يُشركْ بالله فَقَدْ حرّم اللهُ عليه الجنّةَ ومأواه النارُوما للظا لمينَ من أنصارٍ

అనువాదం :

**ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు, వారి నివాసం నరకం . అటువంటి దుర్మార్గులకు సహాయం అందించే వాడెవడూ లేడు.** (అల్ మాయిద: 72)

హదీస్ : షిర్క్‌కు ఒడిగడుతూ మరణించిన వ్యక్తి నరకానికి వెళ్తాడు. (ముస్లిం)

**15.** ప్రశ్న **: 'షిర్క్'కు ఒడిగడుతూ సత్కార్యాలు ఆచరిస్తే** ప్రయోజనం **ఉంటుందా?**

జవాబు : షిర్క్‌కు ఒడిగడుతూ సత్కార్యాలాచరిస్తే ప్రయోజనం ఏమీ ఉండదు.

ولوُأشرَكُوالحبِطَ عنهُم مّا كانُوا يعُملُونَ

అనువాదం:

**ఒకవేళ వారు షిర్క్ చేస్తే, అల్లాహ్‌వారి సత్కార్యాలను నాశనం చేస్తాడు.** (అల్ అన్‌ఆమ్ : 88)

హదీస్ : ఏదైనా కార్యంలో నాతోపాటు ఇతరులను భాగస్వాములుగా చేస్తే, నేను అలాంటి వ్యక్తిని, అతని భాగస్వామ్యాన్ని వదిలి పెడతాను. (ముస్లిం)

**16.** ప్రశ్న **: ముస్లిముల్లో షిర్క్ ఉందా?**

జవాబు : అవును ఉంది. అనేక మంది షిర్క్‌కు పాల్పడుతున్నారు. ఇది ఎంతో బాధాకరమయిన విషయం.

وما يُؤ مِنُ أكثُرهم بالله الا وهُمُ مُشرِكُونَ

అనువాదం :

**వారిలో అల్లాహ్‌ను విశ్వసించేవారు ఎంతమంది లేరు! కాని వారు ఆయనతో పాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతూ ఉంటారు.**
(యూసుఫ్ : 106)

హదీస్ : నా అనుచర సమాజంలోని కొన్ని తెగలు బహుదైవారాధకుల్లో కలిసిపోయినప్పుడు, విగ్రహారాధన జరుగుతున్నప్పుడు ప్రళయం వస్తుంది. (తిర్మిజి)

**17.** ప్రశ్న **: అల్లాహ్ తప్ప ఇతరులను వేడుకోవడం, అంటే వలి అల్లాహ్‌లను వేడుకునే విషయమై ఎలాంటి ఆదేశం ఉంది?**

జవాబు : వారిని వేడుకోవడం షిర్క్ అవుతుంది. అలాంటి వారు నరకానికి వెళ్తారు.

فلا تَدْعُ معَ اللهِ الهاً آخرَ فتكونَ منَ المعذَّبين

అనువాదం:

**నీవు అల్లాహ్‌తోపాటు మరొక దేవుణ్ణి ఎవడినీ వేడుకోకు. అలా చేస్తే నీవు కూడా శిక్షింపబడేవారిలో చేరిపోతావు.** ( అష్ షుఅరా : 213)

హదీస్ : అల్లాహ్ తప్ప ఇతరులను వేడుకుంటూ ఉన్న స్థితిలో మరణించిన వ్యక్తి నరకంలో ప్రవేశిస్తాడు. (బుఖారీ)

**18.** ప్రశ్న **: వేడుకోవడం (దుఆ) దైవారాధన అవుతుందా?**

జవాబు : అవును. వేడుకోవడం దైవారాధన అవుతుంది.

وقال ربُّكم ادْعونى أستَجِبْ لكم ....... الآية

అనువాదం :

**మీ ప్రభువు ఇలా అంటున్నాడు; "నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనను స్వీకరిస్తాను."** (గాఫిర్ : 60)

హదీస్ : 'దుఆ'యే ఆరాధన. (తిర్మిజి)

**19.** ప్రశ్న : **మృతులు పిలుపును వింటాయా?**

జవాబు : మృతులు పిలుపును వినలేవు.

**انک لا تُسمِعُ المَوتی ...... الآیة وماأنتَ بمُسمَعٍ مَنْ فی القُبُرِ**

అనువాదం :

**నిశ్చయంగా నీవు మృతులకు వినిపించలేవు.** (అన్ నమ్ల్ : 80)

**ప్రవక్తా ! సమాధులలో ఖననమైన వారికి నీవు వినిపించలేవు.** (ఫాతిర్ : 22)

హదీస్ : నిశ్చయంగా అల్లాహ్ తరపున తిరుగాడే దైవదూతలున్నారు. వారు నా అనుచర సమాజం పంపే సలామును నా వద్దకు చేరవేస్తారు. (అహ్మద్)

**20.** ప్రశ్న : **మృతులను సహాయం కొరకు ప్రార్థించవచ్చా?**

జవాబు : మృతులను సహాయం కొరకు ప్రార్థించకూడదు, అల్లాహ్‌ను ప్రార్థించాలి.

**اذْ تَستَغِیثُونَ ربَّکُمْ فاستَجابَ لَکُمْ ....... الآیة**

అనువాదం : **మీరు మీ ప్రభువును సహాయం కొరకు ప్రార్థించిన సందర్భాన్ని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి. ఆయన మీ ప్రార్థనను స్వీకరించాడు.** (అల్ అన్ఫాల్ : 9)

హదీస్ : ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం తనకు ఏదైనా బాధకలిగినపుడు ఇలా పలికేవారు 'యా హయ్యు యా ఖయ్యూము బిరహ్మతిక అస్తగీసు' (ఓ మరణం లేని, విశ్వవ్యవస్థను నెలకొల్పి సృష్టి క్రమాన్ని నిర్వహించేవాడా! నేను నీ కారుణ్యం ద్వారా సహాయం కోరుతున్నాను).

**21.** ప్రశ్న : **అల్లాహ్ తప్ప ఇతరుల సహాయం కోరడం ధర్మసమ్మతమేనా?**

జవాబు : ధర్మసమ్మతం కాదు, అల్లాహ్‌ను మాత్రమే సహాయం కొరకు అర్థించాలి.

**اِیَّاکَ نَعۡبُدُ وَاِیَّاکَ نَسۡتَعِیۡنُ**

అనువాదం:

**మేము నిన్నే ఆరాధిస్తాము. సహాయం కొరకు నిన్నే అర్థిస్తాము.**

( అల్ ఫాతిహా : 5)

హదీస్ : మీరు వేడుకుంటే, అల్లాహ్‌నే వేడుకోండి. సహాయం కోసం అర్థిస్తే, అల్లాహ్‌ను మాత్రమే సహాయం కోసం అర్థించండి. (తిర్మిజి)

**22.** ప్రశ్న : **బ్రతికి ఉన్న సృష్టి సహాయం కోరవచ్చా?**

జవాబు : అవును, కోరవచ్చు. వేటి సహాయం అయితే వారు చేయగలుగుతారో, వాటి సహాయం వారి నుంచి తీసుకోవచ్చు.

**وتعاونوا علی البر والتقوی ولا تعاونوا علی الاثم والعدوان**

అనువాదం:

**మంచికి, దైవభీతికి సంబంధించిన పనులలో అందరితోనూ సహకరించండి. పాపకార్యాలలో, అత్యాచారాలలో ఎవరితోనూ సహకరించకండి.**

(అల్ మాయిద : 2)

హదీస్ : దాసుడు తన సోదరుని సహాయంలో ఉన్నంతవరకు అల్లాహ్ దాసుని సహాయంలో ఉంటాడు. (ముస్లిం)

**23.** ప్రశ్న : **అల్లాహ్ తప్ప ఇతరులకు మొక్కుబడులు చెల్లించడం ధర్మ సమ్మతమేనా?**

జవాబు : కేవలం అల్లాహ్‌కు మాత్రమే మొక్కుబడులు చెల్లించాలి.

**رَبِّ انی نَذَرۡتُ لَکَ مافی بطنی مُحَرَّراً فتقبَّل منِّی**

అనువాదం :

**ప్రభూ! నా గర్భంలో ఉన్న శిశువును నేను నీకు సమర్పించు**

**కుంటున్నాను. అది నీ సేవకు అంకితం. నా ఈ కానుకను స్వీకరించు.**
(ఆలిఇమ్రాన్ : 35)

హదీస్ : అల్లాహ్‌కు విధేయత చూపుతానని ఎవరైనా మొక్కుకున్నట్లయితే, అతను ఆ మొక్కుబడి చెల్లించాలి. కాని ఎవరైనా దేవుని అవిధేయతకు సంబంధించి మొక్కుకుంటే, అతను ఆ మొక్కుబడిని చెల్లించరాదు. (బుఖారీ)

**24.** ప్రశ్న: **అల్లాహ్ తప్ప ఇతరులకోసం జిబహ్ చేయడం ధర్మ సమ్మతమేనా?**

జవాబు : ధర్మసమ్మతం కాదు, ఎందుకంటే అది పెద్ద షిర్కు కాబట్టి.

فصلِّ لربّكَ وانحرْ

అనువాదం :

**నీవు నీ ప్రభువు కొరకే నమాజు చెయ్యి. ఖుర్బానీ కూడా ఇవ్వు.**
(అల్ కౌసర్ : 2)

హదీస్ : ఇతరుల కోసం జిబహ్ చేసిన వ్యక్తిని అల్లాహ్ శపించాడు. (ముస్లిం)

**25.** ప్రశ్న : **సమాధుల ప్రదక్షిణం చేయడం ధర్మసమ్మతమేనా?**

జవాబు : కేవలం కాబాగృహ ప్రదక్షిణం చేయడం ప్రవక్త (స) సంప్రదాయం.

وليطّوّفُوا بالبيتِ العتيقِ

అనువాదం :

**వారు ఆ ప్రాచీన గృహానికి ప్రదక్షిణం చెయ్యాలి.** (అల్ హజ్ : 29)

హదీస్ : ఏడుసార్లు కాబా ప్రదక్షిణం చేసి, రెండు రకతుల నమాజ్ చేసిన వ్యక్తికి ఒక బానిసకు విముక్తి ప్రసాదించిన పుణ్యఫలం లభిస్తుంది. (ఇబ్నెమాజా)

**26.** ప్రశ్న : **సమాధుల వైపునకు ముఖాన్ని త్రిప్పి నమాజ్ చేయడం ధర్మ సమ్మతం అవుతుందా?**

జవాబు : సమాధుల వైపునకు ముఖాన్ని త్రిప్పి నమాజ్ చేయడం నిషిద్ధం.

**فول وجهک شطر المسجد الحرام ...... الآية**

అనువాదం :

**నీవు ముఖాన్ని 'మస్జిదె హరామ్' వైపునకు త్రిప్పు.**

(అల్ బఖర : 144)

హదీస్ : మీరు సమాధులపై గాని, సమాధుల వైపునకు ముఖాలను త్రిప్పి గాని నమాజ్ చెయ్యకండి. ( ముస్లిం)

**27.** ప్రశ్న : **చేతబడి చేయడం గురించి ఎలాంటి ఆదేశం ఉంది?**

జవాబు : చేతబడి చేయడం అవిశ్వాసానికి పాల్పడడమవుతుంది.

**ولكن الشّياطينَ كفروا يُعلّمونَ الناسَ السّحرَ ...... الآية**

అనువాదం :

**అసలు అవిశ్వాసానికి పాల్పడింది ప్రజలకు చేతబడిని బోధించే షైతానులే.** (అల్ బఖర : 102)

హదీస్ : వినాశకరమైన ఏడు విషయాలకు దూరంగా ఉండండి, అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టడం, చేతబడి చేయడం.

**28.** ప్రశ్న : **జ్యోతిష్కుని మాటలను నమ్మవచ్చా?**

జవాబు : జ్యోతిష్కుని మాటలను నమ్మడం దైవ తిరస్కారానికి పాల్పడడ మవుతుంది.

**قل لا يعلم من فى السماوات والا رض الغيب الا الله ....... الآية**

అనువాదం :

**వారితో ఇలా అను, ఆకాశాలలోనూ, భూమిలోనూ అల్లాహ్ తప్ప అగోచర జ్ఞానం కలవాడు మరెవ్వడూ లేడు.** (అన్ నమ్ల్ : 65)

హదీస్ : జ్యోతిష్కుని వద్దకు వెళ్ళి అతని మాటలను నమ్మిన వ్యక్తి ముహమ్మద్ (స)పై అవతరింపబడిన బోధనలను తిరస్కరించాడు.

**29.** ప్రశ్న : **అగోచర జ్ఞానం ఎవరికైనా ఉంటుందా?**

జవాబు : అగోచర జ్ఞానం అల్లాహ్‌కు తప్ప ఎవరికీ ఉండదు.

**وعنده مفاتحُ الغيبِ لا يعْلَمُها الا هو ...... الآية**

అనువాదం :

**అగోచరాల తాళం చెవులు ఆయనవద్దనే ఉన్నాయి. వాటిని ఆయన తప్ప ఎవరూ ఎరుగరు.** (అల్ అన్‌ఆమ్ : 59)

హదీస్ : అగోచర జ్ఞానం కేవలం అల్లాహ్‌కే ఉంది. (తబ్రాని)

**30.** ప్రశ్న : **ముస్లిములు వేటిని తమ గీటురాయిగా చేసుకోవడం విధిగా చేయబడింది?**

జవాబు : ఖుర్‌ఆన్, హదీసులను గీటురాయిగా చేసుకోవడం ముస్లిములపై విధిగా చేయబడింది.

**وانِ احْكُمْ بينهم بماأَنْزَلَ اللهُ ...... الآية**

అనువాదం :

**నీవు అల్లాహ్ పంపిన చట్టం ప్రకారం ప్రజల వ్యవహారాలను పరిష్కరించు.** (అల్‌మాయిద : 49)

హదీస్ : అల్లాహ్‌యే తీర్పుచేసేవాడు, మీరు ఆయన వైపునకు మరలి వెళ్లాల్సి ఉంది. (అబుదావూద్)

**31.** ప్రశ్న : **ఇస్లాంకు వ్యతిరేకమైన చట్టాలను అమలు చేసే విషయమై ఎలాంటి ఆదేశం ఉంది.?**

జవాబు : ఇస్లాంకు వ్యతిరేకమైన చట్టాలను అమలు చేయడాన్ని ధర్మ సమ్మతంగా భావించడం కుఫ్రె అక్బర్ అవుతుంది.

ومن لمْ يَحْكمْ بما أنْزلَ اللهُ فاؤلئك هم الكافرونَ

అనువాదం:

**అల్లాహ్ అవతరింపజేసిన చట్టం ప్రకారం తీర్పు చెయ్యనివారే అవిశ్వాసులు.** (అల్ మాయిద: 44)

హదీసు : వారి నాయకులు దైవగ్రంథం ప్రకారం తీర్పు చెయ్యకుంటే, అల్లాహ్ అవతరింపజేసిన చట్టాన్ని ఎన్నుకోకుంటే అల్లాహ్ వారి మధ్యన వివాదాలను, తగదాలను సృష్టిస్తాడు. (ఇబ్నెమాజ)

**32.** ప్రశ్న : **దైవేతరులపై ప్రమాణం చేయడం ధర్మసమ్మతమేనా?**

జవాబు : కేవలం అల్లాహ్‌పై ప్రమాణం చేయడం ధర్మసమ్మతం.

قُلْ بلى وربِّى لَتُبْعَثُنَّ ...... الآية

అనువాదం :

**వారితో ఇలా అను: కాదు, నా ప్రభువు సాక్షిగా! మీరు తప్పకుండా మళ్ళీ లేపబడతారు.** (అత్ తగాబున్ : 7)

హదీస్ : అల్లాహ్ తప్ప ఇతరులపై ప్రమాణం చేసిన వ్యక్తి షిర్కు చేశాడు. (అహ్మద్)

**33.** ప్రశ్న : **తాయత్తులు, గవ్వలు వ్రేలాడదీసుకోవడం ధర్మసమ్మతమేనా?**

జవాబు : సిఫారసు లభిస్తుందని, కష్టాలు దూరమవుతాయన్న విశ్వాసంతో తాయత్తులు, గవ్వలు వ్రేలాడదీసుకోవడం షిర్కుకు ఒడిగట్టడమవుతుంది.

وان يمسَسْك الله بضرٍّ فلا كاشفَ له الا هو ..... الآية

అనువాదం:

**అల్లాహ్ గనక మీకు ఏదైనా నష్టం కలిగిస్తే, ఆయన తప్ప ఆ నష్టాన్నుండి మిమ్మల్ని రక్షించగలిగే వారెవరూ లేరు.**

(అల్ అన్ఆమ్ : 17)

హదీస్ :తాయత్తును వ్రేలాడుతీసుకున్న వ్యక్తి షిర్కు చేశాడు. (అహ్మద్)

**34.** ప్రశ్న : **మనము అల్లాహ్‌ను ఏ విధంగా వేడుకోవాలి?**

జవాబు : మనము అల్లాహ్‌ను ఆయన పేర్లు, ఆయన గుణవిశేషాలు, సదాచరణల ద్వారా వేడుకోవాలి.

**وللہ الا سماءُ الحسنی فادعُوہ بِھا ...... الآیۃ**

అనువాదం :

**అల్లాహ్‌కే మంచి పేర్లు ఉన్నాయి. మీరు ఆయనను మంచిపేర్లతోనే వేడుకోండి.** (అల్ ఆరాఫ్ : 180)

హదీస్ : మీరు మీకోసం పెట్టుకున్న ప్రతి పేరు ద్వారా నేను మిమ్మల్ని పిలుస్తాను. (అహ్మద్)

**35.** ప్రశ్న : **అల్లాహ్‌ను వేడుకొనడానికి ఎవరి సహాయమైనా అవసర మవుతుందా?**

జవాబు : ఎవరి సహాయం తీసుకునే అవసరం లేదు.

**واذا سألک عبادی عنی فانی قریب أجیب دعوۃ الداعی اذا دعان ...... الآیۃ**

అనువాదం :

**నా దాసులు నా గురించి నిన్ను అడిగితే నేను వారికి అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును వింటాను, సమాధానం పలుకుతాను అనీ, ఓ ప్రవక్తా ! నీవు వారికి తెలుపు.** (అల్ బఖర : 186)

హదీస్ : నిశ్చయంగా మీరు అత్యంత సమీపంలో ఉండే, బాగా వినే అస్థిత్వాన్ని వేడుకుంటున్నారు. ఆయన మీతోపాటు ఉన్నాడు. (ముస్లిం)

**36.** ప్రశ్న : **దైవ ప్రవక్త (స) పని ఏమిటి?**

జవాబు : దైవాదేశాలను ప్రజలకు చేరవేయడం.

**یاأیھاالرسول بلِّغ ما أُنزِلَ الیْکَ من رّبِّکَ ...... الآیۃ**

అనువాదం :

**ప్రవక్తా! నీ ప్రభువు తరపునుండి నీపై అవతరించిన దానిని ప్రజలకు అందజెయ్యి.** (అల్ మాయిద : 67)

హదీస్ : ఓ అల్లాహ్ నేను అందజేశాను. నీవు సాక్షిగా ఉండు. (ముస్లిం)

**37.** ప్రశ్న : **దైవ ప్రవక్త (స) సిఫారసు ప్రసాదించమని మనం ఎవరిని వేడుకోవాలి?**

జవాబు : దైవ ప్రవక్త (స) సిఫారసు ప్రసాదించమని మనం అల్లాహ్‌ను వేడుకోవాలి.

قلُ لله الشّفَاعةُ جَمِيُعاً

అనువాదం :

**ప్రవక్తా! మీరు ఇలా అనండి, సిఫారసు అనేది పూర్తిగా అల్లాహ్ చేతిలోనే ఉన్నది.** (అజ్ జుమర్ :44)

హదీస్ : ఓ అల్లాహ్! నీవు ఆయన్ని నాకోసం సిఫారసు చేసేవారిగా చెయ్యి. (తిర్మిజి)

**38.** ప్రశ్న : **అల్లాహ్‌ను ఆయన ప్రవక్త (స)ను మనం ఏ విధంగా ప్రేమించాలి?**

జవాబు : అల్లాహ్ ఆదేశాలు, ఆయన ప్రవక్త (స) ఆదేశాలకనుగుణంగా నడుచుకోవడం, ప్రవక్త (స)కు విధేయత చూపడం ద్వారా మనం అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను ప్రేమించాలి.

قل أطيعوا اللهَ والرسولَ فانْ تولّوافانَ اللهَ لا يُحِبُّ الكافرينَ ...... الآية

అనువాదం:

**ప్రవక్తా! నీవు ఇలా అను, అల్లాహ్‌కూ, ప్రవక్తకూ విధేయత చూపండి. ఒకవేళ వారు నీ ఈ సందేశాన్ని స్వీకరించకపోతే, అల్లాహ్ తనకూ, తన ప్రవక్తకూ విధేయత చూపటానికి నిరాకరించిన వారిని ప్రేమించడం అనేది నిశ్చయంగా జరగదు.** (ఆలి ఇమ్రాన్ : 31)

హదీస్ : మీలో ఎవరైనాసరే అతని మనోవాంఛలు నేను తెచ్చిన ప్రబోధనలకు (షరీఅత్‌కు) లోబడి ఉండనంతవరకూ అతను నిజమైన విశ్వాసి కాజాలడు. (షర్హుస్సున్నహ్ మిష్కాత్, బుఖారీ)

**39.** ప్రశ్న : **దైవ ప్రవక్త (స)ను ప్రశంసించే విషయంలో హద్దుమీరి ప్రవర్తించవచ్చా?**

జవాబు : దైవప్రవక్త (స) ను ప్రశంసించే విషయంలో మితిమీరి ప్రవర్తించ రాదు.

**قل انما أنا بشر مثلكم يُوحى الى أنّما الهكم اللهُ واحدٌ ...... الآية**

అనువాదం :

**ప్రవక్తా! ఇలా చెప్పు, నేను కేవలం ఒక మానవుణ్ణి, మీలాంటి వాణ్ణి, నాకు వహీ (దైవవాణి) ద్వారా ఇలా తెలుపబడింది; మీ దైవం కేవలం ఒకే దైవం.** (అల్ కహఫ్ : 110)

హదీస్ : మీరు నా విషయంలో మితిమీరి ప్రవర్తించకండి. నేనయితే కేవలం ఒక దాసుణ్ణి, నన్ను అల్లాహ్ దాసుడు, ఆయన ప్రవక్త అని అనండి. ( బుఖారీ)

**40.** ప్రశ్న : **అల్లాహ్ తన సృష్టిరాశుల్లో మొదటగా ఎవరిని సృష్టించాడు?**

జవాబు :మనుషులలో హజ్రత్ ఆదం అలైహిస్సలాంను, వస్తువులలో కలాన్ని మొదటగా సృష్టించాడు.

**اذقال ربُّک للملا ئكة انى خالقٌ بشراً منْ طين ...... الآية**

అనువాదం :

**మీరు ఆ సమయాన్ని గుర్తుకుతెచ్చుకోండి, అప్పుడు నీ ప్రభువు దైవదూతలతో ఇలా అన్నాడు; 'నేను మట్టితో ఒక మనిషిని సృజించబోతున్నాను.'** (సాద్ : 71)

హదీస్ : మొదటగా అల్లాహ్ కలాన్ని సృష్టించాడు. (అబుదావూద్)

**41.** ప్రశ్న : **అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయడం గురించి ఎలాంటి ఆదేశం ఉంది?**

జవాబు : సంపదతో, ప్రాణంతో, నాలుకతో జిహాద్ చేయడం తప్పనిసరి.

**انفروا خفافاًوثقالاًوجاهدوابأموالكم وأنفسكم فى سبيل الله .......الآية**

అనువాదం :

**బయలుదేరండి, తేలికగానైనా సరే, బరువుగానైనా సరే. అల్లాహ్ మార్గంలో పోరాడండి. మీ సంపదలనూ, మీ ప్రాణాలను ఒడ్డి.**

(అత్ తౌబా : 41)

హదీస్ : మీరు బహుదైవారాధకులతో పోరాడండి. సంపదల ద్వారా, ప్రాణాల ద్వారా, నాలుకల ద్వారా. (అబుదావూద్)

**42.** ప్రశ్న : **'విశ్వాసులతో స్నేహం' అంటే ఏమిటి?**

జవాబు : ఏకదైవారాధకులైన విశ్వాసులను ప్రేమించచడం, వారితో సహకరించడం.

**والمؤمنونَ والمؤمناتُ بعضُهُمْ أولياءُ بعضٍ ...... الآية**

అనువాదం :

**విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరికొకరు సహచరులు (సహాయకులు).** (అత్ తౌబా :71)

హదీస్ : ఒక విశ్వాసి మరొక విశ్వాసితో కలసి కట్టడంలా రూపొందు తాడు. దాని ఒక భాగం మరొక భాగానికి బలం చేకూర్చుతుంది. ( ముస్లిం)

**43.** ప్రశ్న : **వలీ అల్లాహ్ (అల్లాహ్ మిత్రుడు) ఎవరు?**

జవాబు : కేవలం దైవభీతి గలవాడు మాత్రమే వలీ అల్లాహ్.

**ألاان أؤلياء الله لاخوفٌ عليهم ولا هم يحزنون الذين آمنوا وكانوايتقون**

అనువాదం :

**విను, అల్లాహ్‌కు స్నేహితులైన వారికీ, ఆయనను విశ్వసించి భయ భక్తుల వైఖరిని అవలంబించిన వారికీ ఏ విధమైన భయం కానీ, విషాదం కానీ కలిగే అవకాశం లేదు.** (యూనుస్ : 62)

**44.** ప్రశ్న **: అల్లాహ్ ఖుర్‌ఆన్‌ను ఎందుకు అవతరింపజేశాడు?**

జవాబు : దివ్యఖుర్‌ఆన్‌లోని బోధనలను ఆచరించడానికి అల్లాహ్ దాన్ని అవతరింపజేశాడు.

قل اعملوا فسيرى اللهُ عملَكم ورسولُه والمؤمنونَ

అనువాదం :

**ప్రవక్తా! వారితో ఇలా అను, "మీరు ఆచరించండి. అల్లాహ్, ఆయన ప్రవక్తా, విశ్వాసులూ, అందరూ మీ ఆచరణ వైఖరి ఇప్పుడు ఎలా ఉంటుందో" అని గమనిస్తారు.** (అత్ తౌబా : 105)

హదీస్ : ఖుర్‌ఆన్ పారాయణం చేయండి. దాని ప్రకారం ఆచరించండి. అంతేగాని దాని ద్వారా తినకండి, డబ్బును కూడబెట్టకండి. (అహ్మద్)

**45.** ప్రశ్న **: ఖుర్‌ఆన్ ఎలాగూ ఉంది కదా! అని మనం హదీస్ పట్ల విముఖత చూపగలమా?**

జవాబు : ఎట్టి పరిస్థితిలో కూడా మనం హదీసుపట్ల విముఖత చూపలేము.

وأنزلنا اليك الذكر لتبين للناس مانُزّل اليهم ولعلّهم يتفكّرون

అనువాదం :

**మేము జ్ఞాపికను మీ ప్రవక్తపై అవతరింపజేశాము, నీవు ప్రజల ముందు వారి కోసం అవతరింపజేయబడిన ఉపదేశాన్ని స్పష్టంగా వివరించటానికీ, 'స్వయంగా' ప్రజలు కూడా ఆలోచించటానికీ.**

(అన్ నహ్ల్ : 44)

హదీస్ : వినండి, నాకు ఖుర్‌ఆన్, దానితోపాటు దానిలా ఉండే

హదీస్ కూడా ఇవ్వబడింది. (అబుదావూద్)

**46.** ప్రశ్న : **అల్లాహ్, ఆయన ప్రవక్త (స) ఆదేశాలపై మనము ఇతరుల మాటలకు ప్రాధాన్యత ఇవ్వగలమా?**

జవాబు : లేదు, మనము అల్లాహ్, ఆయన ప్రవక్త (స) ఆదేశాలపై ఇతరుల మాటలకు ప్రాధాన్యత ఇవ్వలేము.

**ياأيهاالذين آمنوا لا تقدموا بين يدى الله ورسوله واتقوا الله ان الله سميع عليم**

అనువాదం:

**విశ్వాసులారా! అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ మించిపోకండి. అల్లాహ్‌కు భయపడండి. అల్లాహ్ సమస్తమూ వినేవాడు, సర్వమూ ఎరిగినవాడూను.** (అల్ హుజురాత్ : 1)

హదీస్ : దేవుని అవిధేయతకు దారితీసే ఏ విషయంలోనూ ఎవరికీ విధేయత చూపకూడదు. అయితే మంచి విషయంలో విధేయత చూపవచ్చు. (బుఖారీ, ముస్లిం)

**47.** ప్రశ్న : **వివాదం తలెత్తినప్పుడు మనం ఏం చేయాలి.?**

జవాబు : మనము ఖుర్‌ఆన్, హదీసుల్లో దాని పరిష్కారం వెదకాలి.

**فانْ تنازَعْتُمْ فى شى ء فرُدّوْه الى اللهِ والرسولِ...... الآية**

అనువాదం :

**మీ మధ్య ఏ విషయంలోనైనా వివాదం తలెత్తితే దాన్ని అల్లాహ్‌కు, ప్రవక్తకు నివేదించండి.** (అన్‌నిసా : 59)

హదీస్ : నేను మీ మధ్య రెండు వస్తువులను వదిలిపోతున్నాను. మీరు వాటిని గట్టిగా పట్టుకొని ఉన్నంతకాలం సన్మార్గం తప్పిపోరు. అవేమిటంటే, ఒకటి: అల్లాహ్ గ్రంథం, రెండోది: ఆయన ప్రవక్త (స) సంప్రదాయం. (ముఅత్తా)

**48.** ప్రశ్న : **'బిద్అత్' అంటే ఏమిటి?**

జవాబు : ఏదేని ధార్మిక కార్యానికి సంబంధించిన ఆధారం ఖుర్ఆన్ హదీసులలో లేక పోవడాన్ని బిద్అత్ అంటారు.

**أَمْ لهم شركاءُ شَرَعُوا لهم من الدِّيْنِ مالمْ يأذنْ به الله ...... الآية**

అనువాదం :

**అల్లాహ్ అనుమతించకుండానే, ధర్మం వంటి స్వభావం గల ఒక విధానాన్ని తమ కొరకు రూపొందించిన దైవభాగస్వాముల నెవరినైనా వారు కలిగి ఉన్నారా?** (అష్ షురా : 21)

హదీస్ : మన ధర్మంలో రూఢీకాని విషయం ఏదైనాసరే అది రద్దు చేయ బడుతుంది. (అంటే స్వీకరించబడదు) (బుఖారీ, ముస్లిం)

**49.** ప్రశ్న : **ఇస్లాంలో 'బిద్అతె హసనా' ఉందా?**

జవాబు : ఇస్లాంలో బిద్అతె హసనా లేదు.

**اليوم أكملتُ لكم دينكم وأتممتُ عليكم نِعْمتي ورَضيتُ لكم الاسلامَ ديناً**

అనువాదం :

**ఈనాడు నేను మీ ధర్మాన్ని మీకొరకు పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేసాను. మీ కొరకు ఇస్లాంను మీ ధర్మంగా అంగీ కరించాను.** (అల్ మాయిద : 3)

హదీస్ : ధర్మంలో కొత్తగా ప్రవేశపెట్టబడిన విషయాల జోలికి వెళ్లకండి. నిశ్చయంగా ప్రతి కొత్త విషయం బిద్అత్ అవుతుంది. ప్రతి బిద్అత్ పెడద్రోవ పట్టిస్తుంది. (అబుదావూద్)

**50.** ప్రశ్న : **ఇస్లాంలో 'సున్నతె హసనా' (మంచి విధానం) ఉందా?**

జవాబు : ఉంది, ఎవరయినా సత్కార్యం చేస్తే దాన్ని అనుసరించవచ్చు.

**واجْعلْنا للمُتّقين اماماً**

అనువాదం :

**మమ్మల్ని భయభక్తులు కలవారికి ఇమాములుగా చెయ్యి.**

(అల్ ఫుర్ఖాన్ : 74)

హదీస్ : ఇస్లాంలో మంచి విధానాన్ని జారీచేసిన వ్యక్తికి, తాను చేసిన దానికి ప్రతిఫలం లభిస్తుంది. అతని తరువాత దాన్ని ఆచరించిన వారందరి ప్రతిఫలం కూడా అతనికి లభిస్తుంది. (ముస్లిం)

**51.** ప్రశ్న : **మనిషి కేవలం స్వీయ సంస్కరణ చేసుకుంటే సరిపోతుందా?**

జవాబు : సరిపోదు. మనిషి తనను సంస్కరించుకోవడంతోపాటు తన సంబంధీకులందరినీ సంస్కరించడం తప్పనిసరి.

**ياأيهاالذين آمنوا قوا أنفسكم وأهليكم ناراً**

అనువాదం :

**విశ్వాసులారా! మీరు మిమ్మల్నీ, మీ కుటుంబ సభ్యులను నరకాగ్ని నుంచి కాపాడుకోండి.** (అత్ తహ్రీమ్ : 6)

హదీస్ : నిస్సందేహంగా అల్లాహ్ ప్రతి బాధ్యతగల మనిషిని, అతని బాధ్యత గురించి అడుగుతాడు, అతడు దాన్ని సంరక్షించాడా లేదా నాశనం చేశాడా అని. (నసాయి)

**52.** ప్రశ్న : **ముస్లిములకు ఎప్పుడు ఆధిపత్యం లభిస్తుంది.?**

జవాబు : దైవగ్రంథం, ప్రవక్త (స) సంప్రదాయాలపై ఆచరించినప్పుడు వారికి ఆధిపత్యం లభిస్తుంది.

**ياأيهاالذين آمنوا ان تنصروا الله ينصركم ويثبت أقدامكم ...... الآية**

అనువాదం :

**విశ్వాసులారా, మీరు అల్లాహ్‌కు సహాయం చేస్తే, ఆయన మీకు సహాయం చేస్తాడు. మీ పాదాలను స్థిరంగా ఉంచుతాడు.** (ముహమ్మద్ : 7)

హదీస్ : నా అనుచర సంఘంలో ఒక వర్గానికి ఎల్లప్పుడు సహాయం లభిస్తుంటుంది. (ఇబ్నెమాజ)

**53.** ప్రశ్న : **ముస్లిములపై ముస్లింల హక్కులు ఎన్ని ఉన్నాయి?**

జవాబు : ముస్లిములపై ముస్లిముల హక్కులు చాలా ఉన్నాయి. ఉదాహరణకు, మంచి పనులలో సహకరించడం, ఇతరుల శ్రేయాన్ని కోరడం, వారి బాధల్లో పాలుపంచుకోవడం.

**والمؤمنون والمؤمنات بعضهم أولياء بعض يأمرون بالمعروف وينهون عن المنكرويقيمون الصلاة ويؤتون الزكاة ويطيعون الله ورسوله أؤلئک سيرحمهم الله ان الله عزيزحكيم ....... الآية**

అనువాదం :

**విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ, వారందరూ ఒకరికొకరు సహచరులు. వారు మేలు చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు చేయవద్దని నిరోధిస్తారు. నమాజ్‌ను స్థాపిస్తారు. జకాత్‌ను ఇస్తారు. అల్లాహ్‌పట్ల ఆయన ప్రవక్త పట్ల విధేయత చూపుతారు. వారి మీదనే అల్లాహ్ తన కారుణ్యాన్ని తప్పకుండా అవతరింపజేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అందరికంటే ప్రబలుడు.** (అత్ తౌబా : 71)

హదీస్: ఒక ముస్లింపై మరొక ముస్లిం హక్కులు ఆరు ఉన్నాయి.

*1. తుమ్మి దుఆ చదివిన ముస్లింకి జవాబు ఇవ్వాలి.*
*2. అతను వ్యాధిగ్రస్తుడు అయితే, వెళ్ళి పరామర్శించాలి.*
*3. అతని శ్రేయాన్ని అభిలషించాలి.*
*4. ఆహ్వానాన్ని స్వీకరించాలి.*
*5. 'సలాం'కు జవాబు ఇవ్వాలి.*
*6. జనాజాకు తోడుగా వెళ్ళాలి (అతని అంత్యక్రియలలో పాల్గొనాలి).* *(అహ్మద్)*

**54.** ప్రశ్న : **సందేశ ప్రచారం విషయంలో ఎలాంటి ఆదేశం ఉంది?**

జవాబు : మన శక్తి మేరకు సందేశ ప్రచారం చేయడం తప్పనిసరి.

ادع الى سبيل ربك بالحكمة والموعظة الحسنة وجادلهم بالتى هى أحسن ....... الآية

అనువాదం:

**ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు, వివేకంతో, చక్కని హితబోధతో, ప్రజలతో ఉత్తమోత్తమ రీతిలో వాదించు.**

(అన్ నహ్లా : 125)

హదీస్ : మీలో ఎవరు చెడును చూస్తారో వారు దానిని తన చేత్తో (బలంతో, అధికారంతో) ఆపాలి. అంత శక్తి లేకపోతే నోటితో ఆపాలి, అదీ సాధ్యం కాకపోతే హృదయంలో దాన్ని చెడుగా భావించాలి. ఇది విశ్వాసంలో అత్యంత హీనమైన స్థాయి. (ముస్లిం)

**55.** ప్రశ్న **: ప్రపంచంలో సన్మార్గగాములు ఉన్నారా?**

జవాబు : ప్రపంచంలో సన్మార్గగాములు భారీ సంఖ్యలో లేనప్పటికీ, వారు మొదటినుంచి ఉన్నారు. ప్రళయం వరకు ఉంటారు.

ولتكن منكم أمة يدعون الى الخيرويامرون بالمعروف وينهون عن المنكروأؤلئك هم المفلحون

అనువాదం :

**మీలో మంచి వైపునకు పిలిచేవారు, మేలు చేయండి అని ఆజ్ఞాపించేవారూ, చెడునుండి వారించే వారూ కొందరు తప్పకుండా ఉండాలి.**

(ఆలి ఇమ్రాన్ : 104)

హదీస్ : నా అనుచర సంఘంలో ఒక వర్గం ఎల్లప్పుడు సత్యంపై ఉంటుంది. వారి వ్యతిరేకులు ప్రళయం వరకు వారికి నష్టం కలిగించలేరు. (బుఖారీ)

**56.** ప్రశ్న **: ఏ వర్గం వారు ధార్మిక సేవ అందరి కంటే ఎక్కువ చేశారు?**

జవాబు : ముహద్దిసీన్‌లు (హదీస్ వేత్తలు) ధార్మిక సేవను అందరికంటే ఎక్కువగా చేశారు. వారు ఇస్లామీయ విశ్వాసాన్ని, ధార్మిక బోధనలను ప్రజల వద్దకు చేరవేయడానికి అసాధారణమైన త్యాగాలు చేశారు.

فلولانفرمن كل فرقة منهم طائفة ليتفقهوافى الدين ولينذرواقومهم اذارجعوا اليهم لعلهم يحذرون

అనువాదం :

**విశ్వాసుల జనపదంలోని ప్రతిభాగం నుండి కొందరు బయలుదేరి వచ్చి, ధర్మ అవగాహనను పెంపొందించుకొని, తిరిగి వెళ్ళి తమ ప్రాంతంలోని ప్రజలకు హెచ్చరిక చేయడం ఎందుకు జరగలేదు? ఇలా చేయడం వల్ల వారు భయపడతారేమో.** (అత్ తౌబా : 122)

హదీస్ : నా మాటను విని, దానిని భద్రపరచుకొని, విన్నది విన్నట్టుగా ఇతరులకు చేరవేసే వ్యక్తిని అల్లాహ్ ప్రఫులంగా ఉంచుగాక. (బుఖారీ)

**57.** ప్రశ్న: **సత్యం ఎవరి పక్షాన ఉంది? ఎవరు సాఫల్యం పొందుతారు?**

జవాబు : ప్రవక్త (స), ఆయన అనుచరుల విధానంపై ఉన్న వారి పక్షాన సత్యం ఉంది. వారే సాఫల్యం పొందుతారు.

واتبعوه لعلكم تهتدون

అనువాదం :

**మీరు ఆయన్ని అనుసరించండి, మీరు సరైన మార్గం పొందుతారేమో.**
(అల్ ఆరాఫ్ : 158)

قل ان كنتم تحبون الله فاتبعونى يحببكم الله ويغفرلكم ذنوبكم والله غفور رحيم

అనువాదం :

**ప్రవక్తా! నీవు ఇలా చెప్పు, మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అనన్యంగా కరుణించేవాడూను.** (ఆలి ఇమ్రాన్ : 31)

హదీస్ : నా అనుచర సంఘంలోని అన్ని వర్గాలు నరకానికి ఆహుతి అవుతాయి- కేవలం నన్ను, నా అనుచరులను అనుసరించే వారు తప్ప. (అల్ ముస్తద్రక్)

**58.** ప్రశ్న : **సామూహికత ప్రాముఖ్యం తెలుపండి?**

జవాబు: ఇస్లాంలో సామూహికతకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ముస్లిములు ఎక్కడ ఉన్నా కలిసి కట్టుగా జీవించాలని, తమ కోసం నియమింపబడిన అధికారికి విధేయత చూపిస్తూ నమాజ్ చేయాలని, జకాత్ చెల్లించాలని, సందేశ ప్రచారం చేయాలని వారికి ఆదేశించడం జరిగింది.

**يا أيهاالذين آمنوا أطيعوا الله وأطيعوا الرسول وأولى الأمرمنكم ....... الآية**

అనువాదం :

**విశ్వాసులారా ! విధేయత చూపండి అల్లాహ్‌కు, విధేయత చూపండి ప్రవక్తకు, మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు.**

(అన్ నిసా : 59)

హదీస్ : నేను నియమించిన పాలకునికి విధేయత చూపిన వ్యక్తి నాకు విధేయత చూపాడు. (బుఖారీ, ముస్లిం)

**59.** ప్రశ్న: **అన్నింటికన్నా ప్రాముఖ్యం గల విధి ఏది?**

జవాబు : నమాజ్ చేయడం అన్నింటికన్నా ప్రాముఖ్యం గల విధి.

**ان الصلاة كانت على المؤ منين كتاباً موقوتاً**

అనువాదం :

**వాస్తవానికి నమాజ్ విశ్వాసులు నిర్ణీత సమయాలలో విధిగా పాటించ వలసిన ధర్మం.** (అన్ నిసా: 103)

హదీస్ : వారికి- మనకు మధ్య తేడా నమాజ్. దానిని వదిలిపెట్టిన వ్యక్తి దైవ తిరస్కారి అవుతాడు. (తిర్మిజి, నసాయి)

**60.** ప్రశ్న : **ధర్మంలో నైతికతకు ఎలాంటి స్థానం ఉంది?**

జవాబు : ఖుర్‌ఆన్, హదీసుల్లో ఉత్తమ నైతికతను అలవర్చుకోవాలని, అనైతికతకు దూరంగా ఉండాలని తాకీదు చేయడం జరిగింది.

**انك لعلى خلق عظيم**

అనువాదం :

**నీవు నిస్సందేహంగా మహోన్నతమైన శీలం కలవాడవు.**

(అల్ ఖలమ్ : 4)

హదీస్ : నన్ను ఉత్తమ నైతిక ప్రమాణాల పరిపూర్ణతకై పంపడం జరిగింది. (ముఅత్తా)

**61.** ప్రశ్న : **ఇస్లామీ వ్యవస్థ లేని దేశంలో మనము ఏ విధంగా జీవించాలి?**

జవాబు : ఇస్లామీ వ్యవస్థ లేని దేశంలో మనము ఇస్లాం మూల స్థంభాలైన నమాజ్, రోజా, జకాత్, హజ్ వంటి విధులను నిర్వర్తించాలి. పెద్ద పాపాలు అంటే వ్యభిచారం, మధ్యపానం, జూదం, వడ్డీ వంటి వాటికి దూరంగా ఉండాలి. మంచి చెయ్యండని ఆజ్ఞాపించాలి, చెడును నిరోధించాలి. అల్లాహ్ దాసులం దరి వరకు దైవ సందేశాన్ని చేరవేయాలి. సాధ్యమైనంత వరకు సందేశ ప్రచారం చేయాలి.

**فاتقوا الله ما استطعتم واسمعوا وأطيعوا وأنفقوا خيراً لأنفسكم ...... الآية**

అనువాదం :

**మీకు సాధ్యమైనంత వరకు అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. వినండి, విధేయత చూపండి, మీ సంపదను ఖర్చుపెట్టండి. ఇది మీకే శ్రేయస్కరం.** (అత్ తగాబున్ : 16)

హదీస్ : నేను ఏ విషయాన్నైనా ఆదేశిస్తే, మీరు మీ శక్తి మేరకు దాని ప్రకారం నడుచుకోండి, నేను వారించిన వాటి జోలికి పోకండి.

(బుఖారీ, ముస్లిం)

**62.** ప్రశ్న : **దాసులలో అందరికంటే అధికంగా హక్కుగల వారెవరు?**

జవాబు : అల్లాహ్ తరువాత తల్లిదండ్రులు అందరికంటే అధికంగా హక్కుగల

వారు. వారి సేవ చేయడం, వారిని గౌరవించడం విధిగా చేయబడింది.

**ووصّينا الا نسان بوالديه حسناً ...... الآية**

అనువాదం :

**తన తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగమని మేము మానవునికి ఉపదేశించాము.** (అల్ అన్‌కబూత్ : 8)

హదీస్ : అబూహురైర (రజి) ఉల్లేఖనం ప్రకారం; ఒక వ్యక్తి ప్రవక్త వద్దకు వచ్చి, దైవ ప్రవక్తా (స)! నా సేవ, సత్ప్రవర్తనలకు అందరికంటే అధికంగా హక్కుగల వారెవరు? అని అడిగాడు. 'నీ తల్లి' అని ఆయన (స) సమాధానమిచ్చారు. అతను తిరిగి అడిగాడు. ఆ తరువాత ఎవరు? 'నీ తల్లి' అని సమాధానం వచ్చింది. తిరిగి అతను 'ఆ తరువాత' అని అడగ్గా తిరిగి 'నీ తల్లి' అనే సమాధానం పలికారాయన. అతడు మరోసారి ఆ తరువాత ఎవరు? అని అడిగాడు. అప్పుడు 'నీ తండ్రి' అని బదులిచ్చారు ప్రవక్త (స).(ముత్తఫకున్ అలైహి)

**63.** ప్రశ్న : **దేవుని అవిధేయత జరిగే పక్షంలో మానవులకు విధేయత చూపవచ్చా?**

జవాబు: దేవుని అవిధేయత జరిగే పక్షంలో మానవులకు విధేయత చూపకూడదు.

**وان جاهداک علی أن تشرک بی مالیس لک به علم فلا تطعهما وصاحبهمافی الدنیامعروفاً**

అనువాదం :

**ఒకవేళ నీవు ఎరుగని వారినెవరినైనా నాకు భాగస్వామిగా చేర్చు అని వారు నిన్ను బలవంతం చేస్తే, వారి మాటలు ఏ మాత్రం వినకు, ప్రపంచంలో వారి పట్ల సద్భావంతో మెలుగుతూ ఉండు.**

(లుఖ్మాన్ : 15)

హదీస్ : సృష్టికర్త అవిధేయత జరిగే విషయంలో మానవులకు విధేయత చూపడం ధర్మసమ్మతం కాదు. (ముత్తఫకున్ అలైహి)

## 64. ప్రశ్న : జీవితం అనగా నేమి?

జవాబు : జీవితం అంటే, ఎడతెగని కృషిగా, మరణం వరకు దైవదాస్యం చేయడం, అల్లాహ్ పట్ల విధేయత చూపడం, ధర్మంపై స్థిరంగా ఉండడం.

وجاهدوافى الله حق جهاده هواجتباكم وما جعل عليكم فى الدين من حرج ملة أبيكم ابراهيم هوسمّاكم المسلمين من قبل وفى هذا ليكون الرسول شهيداً عليكم وتكونوا شهداء على الناس فأقيموا الصلاة وآتوا الزكاة واعتصموا بالله هومولاكم فنعم المولى ونعما النصير

అనువాదం :

**అల్లాహ్ మార్గంలో జిహాద్ చెయ్యండి, జిహాద్ చెయ్యవలసిన విధంగా. ఆయన మిమ్మల్ని తనసేవకై ఎన్నుకున్నాడు. ధర్మంలో మీ కొరకు ఏ ఇబ్బందినీ ఉంచలేదు. మీ తండ్రి ఇబ్రాహీమ్ ధర్మంపై స్థిరంగా ఉండండి. పూర్వం కూడా అల్లాహ్ మీకు 'ముస్లిమ్' అనే పేరునే పెట్టాడు, ఇందులో (ఖుర్ఆన్‌లో) కూడా (మీపేరు ఇదే); దైవప్రవక్త మీ విషయంలో సాక్షిగా ఉండడానికీ మరియు మీరు ప్రజల విషయంలో సాక్షులుగా ఉండడానికీ. కనుక నమాజ్‌ను స్థాపించండి, జకాతు ఇవ్వండి, అల్లాహ్‌తో గట్టి సంబంధం కలిగి ఉండండి. ఆయన మీకు సంరక్షకుడు, ఎంతో మంచి సంరక్షకుడు, ఎంతో మంచి సహాయకుడు.**

(అల్ హజ్ : 78)

واعبدربك حتى يا تيك اليقين

అనువాదం :

**మరణం వరకూ నీ ప్రభువు దాస్యం చేస్తూ ఉండు.**

(అల్ హిజ్ర్: 99)

హదీస్ : మీరు ఉత్తమమైన దాన్ని అన్వేషిస్తూ ఉండండి. పరస్పరం దగ్గరవ్వండి. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో చేసిన కొంత ఆరాధన నవాఫిల్ (అదనపు నమాజ్ )ల ద్వారా సహాయాన్ని పొందండి. తెలుసుకోండి, మీలో ఎవరి ఆచరణ కూడా స్వర్గానికి అర్హునిగా చేయదు. కేవలం దైవకారుణ్యంతోనే మీరు స్వర్గానికి వెళ్తారు. (బుఖారీ)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి) ఉల్లేఖించారు; దైవప్రవక్త (స) ఒక చాపపై పడుకున్నారు. ఇలా పడుకోవడం వల్ల ప్రవక్త (స) వీపుపై చారలు పడ్డాయి. "నా తల్లి తండ్రుల్ని మీకు అర్పింతుగాక! ఓ దైవ ప్రవక్తా! (స) మీరు మాకు ఎందుకు చెప్పలేదు? మేము మీకోసం పరుపు పరిచేవా రము" అని నేను చెప్పగా: దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు, "నాకు ప్రపంచంతో పనేముంది ? నా ఉపమానం ఒక బాటసారి లాంటిది. బాటసారి ఏదేని ఒక చెట్టు క్రింద కాసేపు పడుకొని తిరిగి మళ్ళీ అక్కడి నుండి వెళ్ళిపోతాడు."

(ఇబ్నెమాజా)

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇలా ఉల్లేఖించారు. ప్రవక్త (స) నా భుజం పట్టుకుని, "ఓ అబ్దుల్లాహ్! నీవు ప్రపంచంలో ఓ అపరిచితుడిలా లేదా ఓ బాటసారిలా జీవించు, నిన్ను నీవు మగాడిగా భావించు" అని అన్నారు.

అబుహురైర (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రబోధించారు. దైవ సన్నిధిలో బలవంతుడైన విశ్వాసి బలహీనుడైన విశ్వాసికన్నా ఎక్కువ ప్రియతముడు, ప్రయోజకుడూను. అయితే ప్రతి ఒక్కరి లోనూ ఏదో ఓ మంచి అన్నది ఉండి ఉంటుంది. నీకు ప్రయోజనకరమయిన దానికై ఆశపడు. ధైర్యాన్ని కోల్పోకు. ప్రయత్నం చేసినప్పటికీ నీవు విజయం సాధించనప్పుడు, 'అల్లాహ్ నిర్ణయించాడు, తనకు ఇష్టమైన దాన్ని చేశాడు' అని అను. 'ఆ విధంగా చేసి ఉంటే మరో విధంగా జరిగి ఉండేది' అని అనకు. ఎందుకంటే 'అయితే, గీతే'లతో షైతాన్ పని మొదలవుతుంది.

(ఇబ్నెమాజ)

## لا اله الا الله
## లా ఇలాహ ఇల్లల్లాహ్

'లా ఇలాహ ఇల్లల్లాహ్' సద్వచనం సాఫల్యానికి మూలం. ఈ కలిమా ఎంతో శుభప్రదమయిన కలిమా. ఈ కలిమా షరతులను పాటించకుండా కేవలం దాని పదాలను ఉచ్చరించడం వల్ల ఎలాంటి శుభాలు చేకూరవు.

ఒక వ్యక్తి హజ్రత్ వహబ్ బిన్ మంబాతో, 'లాఇలాహ ఇల్లల్లాహ్' సాఫల్యానికి తాళం చెవి లాంటిది కాదా? అని అడిగాడు. దానికి ఆయన సమాధానంగా, 'ఎందుకు కాదు, ప్రతి తాళం చెవికి దంతాలు ఉంటాయి. తాళం చెవి దంతాలు పటిష్టంగా ఉంటే తాళాన్ని తెరవగలం. లేనట్లయితే తెరువలేము' అన్నారు.

స్వర్గం తాళం చెవి లా ఇలాహ ఇల్లల్లాహ్ దంతాలు అంటే, షరతులు దిగువ చూపిన విధంగా ఉన్నాయి.

**1. జ్ఞానం :** అంటే, కలిమా అర్థ భావాలను బాగా తెలుసుకోవాలి. ఆ జ్ఞానం ఎలా ఉండాలంటే, అది 'లా ఇలాహ ఇల్లల్లాహ్' గురించి ఉన్న అజ్ఞానాన్నంతా దూరం చేసేలా ఉండాలి. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

**فاعلم انه لااله الا الله**

**ప్రవక్తా! బాగా తెలుసుకో, 'అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైనవాడు ఎవ్వడూ లేడు' అని, అంటే లా ఇలాహ ఇల్లల్లాహ్ అర్థభావాలను బాగా తెలుసుకో.** (ముహమ్మద్ : 19)

**2. నమ్మకం:** అంటే, ఇది సందేహాలను అనుమానాలను దూరం చేస్తుంది. కలిమా అర్థభావాలకు వ్యతిరేకంగా ఏ విధమైన సందేహంగాని అనుమానం గాని ఉండకూడదు. అల్లాహ్ ఈ విధంగాసెలవిచ్చాడు:

انماالمومنون الذين آمنوابالله ورسوله ثم لم يرتابوا وجاهدوا بأموالهم وأنفسهم فى سبيل الله أولئک هم الصادقون

**అసలు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ విశ్వసించి, ఇక ఎలాంటి అనుమానానికీ గురికాకుండా తమ ప్రాణాలతో, తమ సిరి సంపదలతో అల్లాహ్ మార్గంలో పోరాడేవారే నిజమైన విశ్వాసులు. వారే సత్యసంధులు.**
(అల్ హుజురాత్ : 15)

**3. స్వీకరణ :** అంటే, ఈ కలిమా హక్కులను, విధులను సంపూర్ణంగా స్వీకరించాలి. అల్లాహ్ హుజురాత్ సూరాలో 'లా ఇలాహ ఇల్లల్లాహ్' హక్కులను, విధులను నిర్వర్తించని వారిని ఖండించాడు. వారిని అవిశ్వాసులుగా పేర్కొన్నాడు.

**4. వినయ వినమ్రతలు :** అంటే, ఈ కలిమా విధుల పట్ల విధేయత చూపాలి. షరీఅత్ ఆదేశాల ముందు వినమ్రులై ఉండాలి.అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

وانيبوالى ربكم وأسلمواله

**మీరు మీ ప్రభువు వైపునకు మరలి, ఆయనకు విధేయత చూపండి.**
(అజ్ జుమర్ : 54)

మరోచోట అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

فلاوربک لا يؤمنون حتى يحكموک فيما شجر بينهم ثم لا يجدوافى أنفسهم حرجاً مما قضيت
ويسلمواتسليماً

**నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయనిర్ణేతగా స్వీకరించనంతవరకు, ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దాని గురించి వారి మనస్సులలో కూడా ఏ మాత్రం సంకోచం లేకుండా దానిని యధాతథంగా శిరసావహించనంతవరకు వారు నిజమైన విశ్వాసులు కాలేరు.** (అన్ నిసా : 65)

ఇబ్నె కసీర్ ఇలా అభిప్రాయపడ్డారు; 'వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయనిర్ణేతగా స్వీకరించనంతవరకు, నీవు ఏ నిర్ణయం చేసినా దాన్ని సత్యంగా భావించనంతవరకు, బాహ్యంగా గోప్యంగా దాని ప్రకారం ఆచరించనంతవరకు వారు విశ్వాసులు కాలేరు' అని మహోన్నతుడైన అల్లాహ్ తన పవిత్ర అస్థిత్వంపై ప్రమాణం చేసి మరీ చెప్పాడు.

**5. సత్యం :** అంటే, హృదయపూర్వకంగా ఈ కలిమాను పలకాలి.

మనసు కూడా, దాని ప్రకారం నడుచుకోవాలి. మఆజ్ బిన్ జబల్ రజి అల్లాహు అన్హు ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: ఎవడయితే చిత్తశుద్ధితో అల్లాహ్ తప్ప మరే ఆరాధ్య దైవం లేడని, ముహమ్మద్ (స) ఆయన సందేశహరులు, దాసులని సాక్ష్యం పలుకుతాడో, అలాంటి వ్యక్తిపై అల్లాహ్ నరకాన్ని నిషిద్ధం చేశాడు.

ఇబ్నె రజబ్ (రహి) ఇలా అన్నారు: దైవాదేశాలకు వ్యతిరేకంగా తన మనోవాంఛలకు దాసోహమై షైతాన్ అడుగుజాడల్లో నడుచుకొనే వ్యక్తి “లా ఇలాహ ఇల్లల్లాహ్” అని సాక్ష్యం పలికినా అది అబద్ధపు సాక్ష్యమే అవుతుంది. ఏ స్థాయిలో అతడు దైవ అవిధేయతకు పాల్పడుతాడో, అదే స్థాయిలో అతని విశ్వాసం బలహీనమవుతుంది. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: **దేవుని మార్గదర్శకత్వం లేకుండా కేవలం తన కోరికలను అనుసరించే వ్యక్తి కంటే పరమ మార్గభ్రష్టుడెవడు?** (అల్ ఖసస్ : 50)

**6. చిత్తశుద్ధి:** అంటే, ఆచరణల్ని షిర్కుకు దారితీసే అంశాలన్నింటి నుంచి దూరంగా ఉంచాలి. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

وماامروا الاليعبدوا الله مخلصين له الدين حنفاء

**వారు అల్లాహ్ దాస్యం చెయ్యాలని, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని మాత్రమే ఆదేశించడం జరిగింది.**

ఫుజేల్ బిన్ ఇయాజ్ (రహి) ఇలా అభిప్రాయపడ్డారు : “ చిత్తశుద్ధితో చేసిన ఆచరణ సవ్యంగా (అంటే దివ్యఖుర్ఆన్, హదీసుల ప్రకారం) లేనట్లయితే స్వీకరించబడదు. ఆచరణ సవ్యంగా ఉండి చిత్తశుద్ధితో చేయనట్లయితే అది కూడా స్వీకరించబడదు. సవ్యంగా చిత్తశుద్ధితో చేసినప్పుడు మాత్రమే స్వీకరించబడుతుంది. అంటే, ఆ ఆచరణ దైవ ప్రసన్నతకోసం చేసి ఉండాలి. ప్రవక్త (స) సంప్రదాయం ప్రకారం చేసి ఉండాలి.

**7. ప్రేమ :** అంటే, ‘లా ఇలాహ ఇల్లల్లాహ్’ కలిమాను, కలిమా

చదివిన వారిని (అంటే ముస్లిములను, కలిమా ప్రకారం అనుసరించే వారిని ప్రేమించాలి).

సహీహ్ హదీసులో ఇలా ఉంది: ఏ వ్యక్తిలోనయితే మూడు విషయాలు ఉంటాయో అతడు విశ్వాసంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు. అతని దృష్టిలో అల్లాహ్, ఆయన ప్రవక్త (స) అందరికంటే ఎక్కువ ప్రీతి పాత్రులయి ఉండాలి. అతను అల్లాహ్ కోసం ఇతరులను ప్రేమించాలి. తనను నరకంలో పడ వేయడాన్ని ఎంతంగా అయిష్టపడతాడో, అంతగానే దైవతిరస్కారం నుంచి సాఫల్యం పొందిన తరువాత తిరిగి దానివైపు వెళ్ళడాన్ని అయిష్టపడాలి.

## محمد رسول الله
## ముహమ్మదుర్రసూలుల్లాహ్

మహోన్నతుడైన అల్లాహ్ తన పేరుతో పాటు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహివసల్లం పేరును జతపరిచాడు. ప్రవక్త ముహమ్మద్ (స)కు విధేయత చూపకుండా కేవలం అల్లాహ్‌ను ప్రభువుగా విశ్వసించినంత మాత్రాన ఎవరూ సాఫల్యాన్ని పొందలేరు. జీవితానికి చెందిన అన్ని వ్యవహారాల్లో ప్రవక్త (స) జీవితం మంచి మార్గదర్శకం. దేవుని ఏకత్వం మనిషి హృదయంలో ప్రవేశించినప్పుడే, జీవితానికి చెందిన అన్నీ ఆచరణలు, కార్యకలాపాలు, చేతలు, కదలికలు, మనోభావాలు, భావోద్రేకాలు అన్నీ దాని రంగులో రంగరించబడతాయి. అప్పుడే వీటన్నింటికి పునాది, మూలం కేవలం దైవ ప్రసన్నత, పరలోక సాఫల్యం అవుతాయి.

మహోన్నతుడైన అల్లాహ్ విశ్వాసాలను సంస్కరించడానికి, ఆలోచనలను, ఆచరణలను సరిదిద్దడానికి ప్రవక్తలను మార్గ దర్శకులుగా చేశాడు. వారిపై దయచూపాడు. తన పర్యవేక్షణలో వారి నుంచి పనితీసుకున్నాడు. వారి విధేయతను వారి జాతులపై విధిగా చేశాడు. అల్లాహ్ ముహమ్మద్ (స)ను ప్రవక్తగా చేసి పంపి ప్రళయం వరకు విశ్వ మానవులం దరూ ఆయనపట్ల విధేయత చూపాలని, లేనట్లయితే సాఫల్యం పొందలేరని సూచించాడు.

## మనపై ప్రవక్త (స) గారి హక్కులు క్రింది విధంగా ఉన్నాయి:

**1. విశ్వాసం:** ముహమ్మద్ (స)ను సత్య ప్రవక్తగా విశ్వసించాలి.

والذين يؤمنون بماأنزل اليک

"మేము నీపై అవతరింపజేసిన గ్రంథాన్ని విశ్వసించేవారు సాఫల్యం పొందుతారు." (అల్ బఖర : 4)

**2. విధేయత:** జీవితానికి చెందిన అన్ని వ్యవహారాల్లో ప్రవక్త ముహమ్మద్ (స)కు విధేయత చూపడం తప్పనిసరి.

لقدكان لكم فى رسول الله أسوة حسنة لمن كان يرجوالله واليوم الآخروذكرالله كثيراً

వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉంది. అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకుని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికి. (అల్ అహ్‌జాబ్ : 21)

**3. ప్రవక్త(స)కై దరూద్, సలామ్‌లు పంపడం:** ప్రవక్త (స) పై అత్యధికంగా కారుణ్యాలను కురిపించమని అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండాలి.

ياأيهاالذين آمنوا صلوا عليه وسلموا تسليماً

విశ్వాసులారా! మీరు కూడా ఆయనకై దరూద్ సలామ్‌లు పంపండి. (అల్ అహ్‌జాబ్ : 56)

**4. ప్రవక్త (స) పవిత్ర భార్యలను ఆయన అనుచరులను గౌరవించడం:**
అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

النبى أولى بالمومنين من أنفسهم وأزواجه أمهاتهم

"నిస్సందేహంగా విశ్వాసులకు దైవప్రవక్త స్వయంగా తమకంటే కూడా ముఖ్యుడు. దైవప్రవక్త భార్యలు వారికి తల్లులు." (అల్ అహ్‌జాబ్ : 6)

لقد رضی الله عن المومنين اذ يبايعونک تحت الشجرة

"విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు, అల్లాహ్ వారిని చూసి ఆనందించాడు. (అల్ ఫతహ్ : 18)

## 5. ప్రవక్త (స) బోధించిన బోధనలను ప్రచురించడం, వాటి ప్రచారం చేయడం:

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

**"మీలో ఇక్కడ హాజరయిన వారు హాజరుకానివారికి నా సందేశాన్ని చేరవేయాలి."**

*ఇంకో చోట ప్రవక్త (స) ఇలా ప్రవచించారు :*

**"నా మాటను విని, దాన్ని భద్రంగా ఉంచి, జ్ఞాపకం పెట్టుకుని, విన్నది విన్నట్టుగా యధాతథంగా ఇతరులకు చేరవేసిన దాసుణ్ణి దైవం సదా ప్రఫుల్లంగా ఉంచుగాక.** (బుఖారీ)

# జమ్‌యియ్యతె అహ్లెహదీస్
# ఆంధ్రప్రదేశ్

| | | |
|---|---|---|
| అధ్యక్షులు | : | మౌలానా అబ్దుల్ బాసిత్ రియాజి |
| ఉపాధ్యక్షులు | : | మౌలానా సఫీ అహ్మద్ మదనీ |
| నాజిము | : | జనాబ్ అబ్దుల్లాహ్ అల్‌మాస్ సాహెబ్ |
| కోశాధికారి | : | జనాబ్ ముహమ్మద్ నజీర్ సాహెబ్ |